ప్రజాశక్తి

ఆదివారం 31 ఆగస్టు 2025

5

పార్వతీపురం మన్యం

ఇవిఎం గోడౌన్ తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద గల ఇవిఎం గోదామును జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా శనివారం ఆయన గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్లను ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టరులో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ, ఏర్పాట్లపై పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, తహసీల్దార్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్‌కు సర్వే

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఇఒడిబి) ర్యాంకింగ్‌కు సర్వే చేస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా పరిశ్రమల పురోగతి, ఎగుమతుల మండలి (డిఐపిఇసి), ఇఒడిబి ఔట్ రీచ్ వర్క్ షాప్ (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్ సర్వే) పై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, పారిశ్రామికవేత్తలతో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్ ఆఫ్ ఇండియా అనేది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వార్షిక వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక అంశాల ఆధారంగా ఆయా ప్రాంతాల వార్షిక వ్యాపార సౌలభ్యం యొక్క సూచిక అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఆధారంగా, భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పరిశ్రమ, అంతర్గత వాణిజ్యం ప్రమోషన్ విభాగం ద్వారా రాష్ట్రాల ర్యాంకింగ్‌ను 2015 నుంచి ఇస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇది పెట్టుబడులను సంస్కరించడానికి, ఆకర్షించడానికి రాష్ట్రాల సుముఖతను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. పారిశ్రామిక, వ్యాపార వర్గాలకు అనుకూల విధానాలు కలిగిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని, ఇది కొనసాగేందుకు పారిశ్రామిక వర్గాలు సర్వేలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 2024 సంవత్సరానికి ర్యాంకింగ్స్‌కు డిపిఐఐటి సర్వేను చేపట్టడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియను ఇఒడిబిలో సేవలు పొందిన వినియోగదారులకు వివరించేందుకు ఇఒడిబి ఔట్ రీచ్ వర్క్ షాప్‌ను నిర్వహిస్తుందని చెప్పారు. జిల్లాలో 2024లో 570 మంది వినియోగదారులు ఇఒడిబిలో వివిధ రకాలైన సేవలను 18 ప్రభుత్వ శాఖల ద్వారా పొందిందన్నారు. ఈ సేవలను ఏక గవాక్ష విధానం ద్వారా అందజేశాయని ఆయన చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు, నీటి వసతులు పరిశీలించాలి

పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక సదుపాయాలు, నీటి వసతులు అవసరమని, వాటి లభ్యతను విధిగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులకు స్థలాలు పరిశీలించాలని ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్‌ను ఆదేశించారు. పిఎంఇజిపి కార్యక్రమంలో జిల్లాలో కనీసం 75 యూనిట్లను నెల రోజుల్లో ప్రారంభించాలని ఆదేశించారు. వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ వర్క్ షాప్ కు హాజరైన పారిశ్రామిక వేత్తలు తాము పొందిన సేవలను తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా కార్మిక శాఖ అధికారి సువర్ణ, కార్మిక శాఖ అధికారి బి.రాంబాబు, పరిశ్రమల శాఖ కన్సల్టెంట్ రాజా హర్ష, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

సారాను అరికడదాం... కుటుంబాలను కాపాడుదాం

మత్తు, మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో నాటు సారాను అరికట్టి కుటుంబాలను కాపాడుదామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మత్తు, మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటు సారాతో యువత అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. అనారోగ్యం వల్ల పని చేసే శక్తి తగ్గి కుటుంబ ఆర్థిక స్థితిగతులు చిన్నాభిన్నమవుతున్నాయని పేర్కొన్నారు. అటువంటి కుటుంబాల్లో చైతన్యం తీసుకొచ్చి, నాటు సారాకు దూరం చేసి జీవనోపాదుల కల్పనకు చర్యలు చేపడతామని తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరా చేసేవారికి శిక్షలు పడేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. అటవీ ప్రాంతం గుండా, బస్సులు, ఇతర వాహనాల ద్వారా జరిగే మత్తు పదార్థాల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఉంచాలని అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే చెడు ప్రభావాలపై గ్రామ స్థాయిలో, విద్యా సంస్థల్లో అవగాహన నిర్వహించాలని తెలిపారు. విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల ప్రభావం పడకుండా మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు అక్రమ రవాణా కాకుండా అడ్డుకట్ట వేయడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హితవు పలికారు. ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి పోలీసు శాఖ చేపట్టిన చర్యలను వివరించారు. సమావేశంలో ఎఎస్‌పి అంకిత సురాన, డిఎస్‌పి ఎం.రాంబాబు, జిల్లా రవాణా అధికారి టి.దుర్గాప్రసాద్, జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అధికారి ఆశా షేక్, ఇతర అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు బార్లు కేటాయింపు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎక్సైజ్ శాఖ లాటరీ విధానంలో ఓపెన్ కేటగిరీ బార్లు, గీత కార్మికులకు సంబంధించిన బార్లు కేటాయింపునకు శనివారం లాటరీ విధానం నిర్వహించినట్లు జిల్లా మద్య నిషేధ, అబ్కారీ శాఖ అధికారి బి.శ్రీనాథుడు తెలిపారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సమక్షంలో ఈ లాటరీ జరిగిందన్నారు. ఈ విధానం ద్వారా జిల్లాలో నాలుగు బార్లకు లాటరీ విధానం ద్వారా ఎంపిక చేశామని చెప్పారు. జిల్లాలో 19 దరఖాస్తులకు గానూ రూ.96.90 లక్షలు వచ్చాయని శ్రీనాథుడు తెలిపారు.

మద్యం షాపులకు లాటరీ తీస్తున్న కలెక్టర్

పోగొట్టుకున్న ఫోన్లు బాధితుల చెంతకు..

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మొబైల్ ఫోన్లు పోయిన వెంటనే సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ ఎస్ వి మాధవరెడ్డి అన్నారు. ప్రస్తుత కాలంలో సమాచారం చేరవేతకు, వినోదానికి, విజ్ఞానానికి, ఇతర అత్యవసర సమాచారం కోసం మొబైల్ ఫోన్లు ఎంతో ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. గత ఆరు నెలలలో వివిధ కారణాల వల్ల పోగొట్టుకున్న, దొంగలించబడిన సుమారు రూ.42 లక్షల విలువ చేసే 206 మొబైల్ ఫోన్లను సిఇఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి నేడు 'మొబైల్ రికవరీ మేళా" కార్యక్రమం ద్వారా బాధితులకు అందజేశామని తెలిపారు. యడం జరిగిందని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, పేర్కొన్నారు. బాధితులు మొబైల్ పోయిందని ఫిర్యాదు చేస్తే, పోయిన మొబైల్ దొరికి ఉంటే వారికి సమాచారం ఇచ్చి పిలిపించి నిర్ధారించుకొని మొబైల్ అప్పగిస్తామన్నారు. ఎవరైతే ఫోన్లను పోగొట్టుకున్నరో/ దొంగలించబడినవో సంబంధిత బాధితులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా, సిఇఐఆర్ పోర్టల్ https://www.ceir.gov.in పబ్లిక్ వెబ్ సైట్‌లో బ్లాకింగ్ అభ్యర్థన ద్వారా రిజిస్టర్ చేసుకున్నట్లయిన, ఆ ఫిర్యాదుల ఆధారంగా సదరు మొబైల్ ఐఎంఇఐ నెంబర్లు బ్లాక్ అయిన తర్వాత ఆ రిక్వెస్ట్‌ను తాము రిసీవ్ చేసుకుని, సదరు మొబైల్‌ను ట్రాక్ చేసి, రికవరీ చేసిన తర్వాత మొబైల్‌ను అన్ బ్లాక్ చేసి మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తికి ఇస్తున్నామని అన్నారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను అతి తక్కువ కాలంలోనే ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన సోషల్ మీడియా, సైబర్ సెల్ సిఐ శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి అంకిత సురాన, పాలకొండ డిఎస్‌పి రాంబాబు, ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, సోషల్ మీడియా, సైబర్ సెల్ సిఐ శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐ రంగనాథం, సిసిఎస్ సిఐ ఎం.అప్పారావు, డిసిఆర్‌బి సిఐ ఆదాం, ఎఆర్ ఆర్ఐ నాయుడు, సోషల్ మీడియా,సైబర్ సెల్ ఎస్సై రవీంద్ర రాజు, ఆర్ఎస్ఐ, ఇతర అధికారులు ,సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బాధితురాలికి సెల్‌ను అందజేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

ఉత్సవాల నిర్వహణకు రూ.50 లక్షలు : మంత్రి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కీర్తిని పెంచేవిధంగా విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి పండగ జరగాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. పైడితల్లి అమ్మవారి ఉత్సవాలపై శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అక్టోబర్ 6,7 తేదీలలో జరగబోయే పైడితల్లి అమ్మ వారి ఉత్సవాలు భక్తుల్లో మధురానుభూతిని కలిగించేలా నిర్వహించాలని అన్నారు. గత ఏడాది కంటే గొప్పగా నిర్వహించాలని తెలిపారు. ఉత్సవాలకు వారం రోజుల ముందు నుండే నగరమంతా విద్యుత్ కాంతులతో అలంకరించాలని, తాగునీటి సరఫరా , పారిశుధ్యం , నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సిరిమాను ఊరేగింపు 3 గంటలకే మొదలు పెట్టాలని, 5 గంటలకు ముగించాలని సూచించారు. కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ శాఖల వారీగా ఎవరెవరు ఏ ఏ పనులు చేయాలో ఆదేశించారు. సాధారణ దర్శనాలకు ఇబ్బంది కలగకుండా విఐపి దర్శనాలను ఏర్పాటు చేయాలని దేవాలయ అధికారులకు ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, మెడికల్ క్యాంపు, 108 వాహనం ఏర్పాటు చేయాలని తెలిపారు. సిరిమాను రథం ఫిట్నెస్‌ను అటవీ అధికారులు తనిఖీ చేయాలని, ఆర్‌డిఒ, అటవీ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. భక్తులు వచ్చే రూట్లలో బస్సుల సంఖ్య పెంచాలని, ఆర్.టి.సి అధికారులకు ఆదేశించారు. తెప్పోత్సవం దగ్గర గజ ఈతగాళ్ళను ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులకు ఆదేశించారు. ఉత్సవాల కోసం ప్రభుత్వం రూ.50లక్షలు కేటాయించిందని, నిధులు విడుదల కోసం డిఒ లేఖ రాశామని తెలిపారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ సమన్వయం తో పని చేసి పండగను విజయవంతం చేయాలని తెలిపారు. ఎస్‌పి వకుల్‌జిందల్ మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాల కోసం 2 వేల మంది పోలీసులను నియమిస్తామని తెలిపారు. సమావేశంలో జెసి సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, డిసిఎంఎస్ చైర్మన్ గొంపకృష్ణ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష, ప్రధాన పూజారి బంటుపల్లి వెంకట రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పైడితల్లి ఉత్సవాల కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గోపాల మిత్రల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు

గోపాలమిత్రల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లాలో వున్న గోపాలమిత్రల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో శనివారం గోపాల మిత్రుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.గణపతి అధ్యక్షుతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మలమన్మధరావు, ఆ సంఘం కార్యదర్శి సన్యాసి నాయుడు మాట్లాడుతూ గ్రామంలో మూగజీవులకు సేవ చేస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మంచి పేరు తెస్తున్న గోపాల మిత్రులు బ్రతుకు ఆగమ్య గోచరంగా ఉందన్నారు. నెలకు రూ.6,500 గౌరవ వేతనంతో బతకడం చాలా కష్టంగా ఉందని చెప్పారు. విద్య, వైద్యంతో పాటు రోజురోజుకూ నిత్యవసర వస్తువు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో గోపాల మిత్రలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఈఎస్ఐ పిఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, 25 సంవత్సరాల నుండి పని చేస్తున్న గోపాల మిత్ర లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం రెడ్డి తవిటి నాయుడు రిటైర్మెంట్ అయిన సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు పలికి సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో, భోగి శ్రీను, అల్లు రామకృష్ణ నాయుడు, కె.మోహన్ రావు, కె.వెంకట రమణ, జి.శంకరరావు, జి.శ్రీను, సోమశేఖర్, శ్రీకాంత్, ముత్యాలరావు, స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

జైల్ రికార్డులను పరిశీలిస్తున్న సివిల్ జడ్జి హరిప్రియ

సబ్‌జైల్ సందర్శన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ హరిప్రియ స్థానిక సబ్ జైలును శనివారం సందర్శించి ఖైదీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె ఒక్కొక్క ఖైదీతో మాట్లాడుతూ ఈ జైల్లో మీకు ఏమైనా ఇబ్బందిగా ఉందా, అలాగే మెనూ ప్రకారం ఆహారం ఇస్తున్నారా, బెయిల్ కోసం లాయర్లను ఏర్పాటు చేసుకున్నారా ఆరా తీశారు. దీనికి ఖైదీలు ఇక్కడ అంతా బాగనే ఉందని బదులిచ్చారు. మీకు జైల్లో ఏ సమస్యలున్నా ఫిర్యాదు రాసి కంప్లీట్ బాక్స్‌లో వేయాలని సూచించారు. కార్యక్రమం లో సీనియర్ న్యాయవాదులు శామ్యూల్, బొడ్డు రామ్మోహన్ రావు, ఎ.శివదాసు, ఎం.వెంకటేశ్వర్లు, జైలు ఇన్చార్జ్ రమణయ్య, హెడ్ వార్డర్ బి.విజయకుమార్, హేమసుంధర్, బి.నరసింహులు, జిపిటి నాయుడు, ఎం.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి - కొమరాడ

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహానికి పాల్పడే వారికి కఠిన శిక్షలు ఉంటాయని లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు అన్నారు. మండలంలోని గుమడలో ఎస్‌సి, ఎస్‌టి న్యాయ అవగాహనా సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టాయని పేర్కొన్నారు. అమ్మాయికి వివాహం జరిపించాలంటే కనీస వయసు 18 సంవత్సరాలు నిండాలని, అప్పుడే బాలికలు మానసికంగా ధైర్యంగా నిలబడగలదని తెలిపారు. బాలికలకు బాల్యంలోనే వివాహం జరిగితే, చిన్న వయసులోనే పిల్లలు పుట్టే అవకాశం ఉందన్నారు. దీనివల్ల పుట్టే పిల్లల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందన్నారు. చిన్న వయసులో వివాహమైన బాలికలకు పుట్టే పిల్లలు తక్కువ బరువుతో పుడతారని, ముందస్తు ప్రసవం, తీవ్రమైన నవజాత శిశువుల పరిస్థితులతో పాటు, చిన్న వయస్సు నుండే పోషకాహార, ఎదుగుదల లోపాలతో బాధపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అందువల్ల బాల్య వివాహాలు ప్రోత్సహించకూడదని కోరారు. కార్యక్రమంలో అడ్వకేట్ ఎంవి రమణ, రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న లోక్‌అదాలత్ సభ్యులు జోగారావు

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్, చౌక ధరల దుకాణాన్ని సబ్ కలెక్టర్ డాక్టర్ ఆర్.వైశాలి శనివారం తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్, చౌక ధరల దుకాణంలో రికార్డులను, నిల్వలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండరాదని ఆమె స్పష్టం చేశారు. రేషన్ పంపిణీ సమయంలో ఎటువంటి అవకతవకలు ఉండరాదని ఆమె అన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వైశాలి

అధికారుల అలసత్వం... గండి పడిన ఆదాయం

- పాట దారులు రాలేదంటూ రెండేళ్లుగా వాయిదా
- ఏప్రిల్‌లో జరగాల్సిన వేలం సెప్టెంబర్లో..
- మక్కువ మేజర్ పంచాయతీ తీరు

ప్రజాశక్తి - మక్కువ

పంచాయతీల ఆర్థిక వనరుల మెరుగుదలలో అధికారుల పాత్ర ఎంతో కీలకమైంది. అయితే ఆ అధికారులే నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీల ఆదాయం అడుగంటిపోయే పరిస్థితి నెలకొంటుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆదాయానికి గండిపడుతూ ఉన్న ఏ ఒక్కరూ పట్టించుకోని పరిస్థితి. గత రెండేళ్లుగా స్థానిక మార్కెట్‌కు సంబంధించి వేలం పాటలు నిర్వహించకపోవడం ఒకంత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అలాగే ఈ ఏడాది కూడా ఏప్రిల్‌లో నిర్వహించాల్సిన వేలం పాటలు సెప్టెంబర్‌లో నిర్వహించడం వెనుక అధికారుల నిర్లక్ష్య వైఖరి పట్ల సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోనికి వెళ్తే...

మక్కువ మేజర్ పంచాయతీలోని మార్కెట్ దుకాణాలతో పాటు గ్రామంలోనికి ప్రవేశించే పలు వాహనాలు, ఇతరత్రా వాటిపై ప్రతి ఏటా ఆసీలు పాట వేలం వేయాల్సి ఉంది. కరోనా నుంచి ఈ వేలం పాటలో పూర్తిగా స్థానిక మేజర్ పంచాయతీలో గాడి తప్పాయని చెప్పక తప్పదు. గత రెండేళ్ల వేలం పాటలు నిర్వహించినా పాటలో పాల్గొనేందుకు ఎవరూ ఉత్సాహం చూపలేదని, దీంతో పంచాయతీకి వేలంపాట ఆదాయం ఏమీ లేదని బదిలీపై వెళ్లిన ఇఒ సురేష్ తెలిపారు. అలాగే ఏప్రిల్‌లో కొత్తగా వేలంపాట నిర్వహించాలని అధికారులు ఆదేశించినా అప్పటి ఇఒపిఆర్‌డికి అనారోగ్యం వల్ల వేలం పాటవేయలేదని, ఆ తర్వాత బదిలీలు పరిస్థితులు తలెత్తడంతో అలా ఉండిపోయిందని ఆయన తెలిపారు. గతంలో అధికారులు వేలంపాటలు నిర్వహించకపోవడం వల్లే కొత్తగా ఇఒగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు అధికారుల ఆదేశాలతో 2025- 26 సంవత్సరానికి గాను ఏడు నెలలకు ఆశీలు పాటకు ప్రకటన విడుదల చేశారు. రెండేళ్లలో వేలంపాట నిర్వహించి ఉంటే సుమారు రూ.2లక్షల వరకు పంచాయతీకి ఆదాయం లభించేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో మార్కెట్లో అనధికార వసూళ్లకు కూడా కొంతమంది పాల్పడ్డారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీకు రావాల్సిన ఆదాయ వనరులపై అధికారులు దృష్టి సారించి, పంచాయతీ అభివృద్ధి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

మక్కువ మేజర్ పంచాయతీలోని సంత

అన్నదాతపై అలక్ష్యం తగునా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఒక్కనాడు అదును... ఏడాది బతుకు అంటారు. ఈ సామెత ఉత్తరాంధ్రాలోనూ ముఖ్యంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోనూ అక్షరాల నిజమే. కురుస్తున్న వర్షపునీటి ఆధారంగానే వరినారుగానీ, ఉబాలుగానీ పట్టేది. చివరికి పంట పండేవరకు మెజార్టీ సాగుభూమికి వర్షపునీరే ఆధారం. అందుకే ఎన్ని పనులున్నా వాన పడగానే చినుకునీటిని ఒడిసిపట్టి వెంటవెంటనే ఉబాలు పడుతుంటారు. కానీ, ఈ ఏడాది వర్షాలు పడినా, సాగునీటి ప్రాజెక్టుల చివరి ఆయుకట్టుకు నీరు చేరలేదు. 1.20లక్షల ఎకరాల ఆయుకట్టుగల తోటపల్లి బ్యాంరేజీ ఆయుకట్టులో పట్టుమని పాతికవేల ఎకరాలకు మించి సాగునీరు అందలేదు. మిగిలిన జలాశయాల కిందా ఇదే పరిస్థితి. జలాశయాల్లో నీరు ఉన్నప్పటికీ, కాలువల నిర్వహణ ప్రభుత్వాలు గాలికి వదిలేయడమే ఇందుకు కారణం. దీంతో, మోటార్లు పెట్టుకుని మరీ పంటలు సాగుచేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, నువ్వులు, పెసలు, మినుములు, తదితర 16 రకాల పంటలు 2,92,482 ఎకరాల్లో సాగు కావాల్సివుండగా ఇప్పటి వరకు 2,35,240 (80శాతం) ఎకరాల్లో సాగైంది. ఇందులోనూ అత్యధికంగా వరి సాధారణ విస్తీర్ణం 2,28,035 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 1,90,540 ఎకరాల్లో (84శాతం) సాగైంది. ఈ దశలో వరి వేరుతన్నడానికి, ఎదుగుదలకు యూరియా, ఎడిపి వంటి ఎరువులు విరివిరిగా అవసరం కాగా, జిల్లాలో ఎక్కడా అందుబాటులో లేదు. ఉన్న కొద్దిపాటి ఎరువులను ప్రైవేటు డీలర్లు బ్లాక్‌చేసి, అధిక ధరలకు విక్రయించుకుంటున్నారు. రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌ల ద్వారా కేటాయించిన ఎరువులు రాజకీయ నాయకుల వంతయ్యాయి. అధికారుల లెక్కల ప్రకారం వివిధ పంటల సీజనల్ కండీషన్ బట్టి జిల్లా వ్యాప్తంగా 32,600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఆగస్టు ప్రారంభం నాటికి వచ్చింది కేవలం 24,360 మెట్రిక్ టన్నులు మాత్రమే. దీన్నిబట్టి 8,240 మెట్రిక్ టన్నుల కొరత ఉన్నట్టుగా స్పష్టమౌతోంది. దీనిపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నవ్విపోదరుగాక నాకేంటి? అన్నట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికీ వీరు జోక్యం చేసుకోకపోవడం దారుణమని జనం చర్చించుకుంటున్నారు. దీన్ని అలుసుగా తీసుకున్న ప్రైవేటు డీలర్లు యూరియా బస్తాపై రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో యూరియా దొరకడమే గగనం అంటూ సెలవిస్తున్నారు. దీంతో, అదునుకు గుండా పిండీ వేయలేకపోతే గింజలెలా పండుతాయని, ఏడాది పొడవునా బతుకెలా ఈడుస్తామని రైతులు, వ్యవసాయ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. అయినా పాలకుల్లో ఇసుమంత స్పందన కనిపించడం లేదని వాపోతున్నారు.

'సంతోష'ం మూడింతలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండల కేంద్రమైన బలిజిపేట గొల్ల వీధికి చెందిన లొడగాన సంతోష్ కుమార్ ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ఎంపికయ్యారు. వరుసగా వివిధ విభాగాల్లో మూడు ర్యాంకులు సాధించారు. అవనిగడ్డలో ఉపాధ్యాయ శిక్షణ పొంది ఉన్నత స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ 43వ ర్యాంకు, పిజిటిలో 17వ ర్యాంకు, టిజిటిలో 57వ ర్యాంకు సాధించారు. అయితే ఒక ఉద్యోగం సాధించడానికి ఎంతో పోటీ, ఎన్నో శిక్షణా తరగతులు పొందాల్సిన ఉంది. అయితే తన మేధాశక్తితో మూడు ఉద్యోగాలకు ఎంపికై తన సత్తా చాటి చెప్పి యువతకు ఆదర్శంగా సంతోష్ కుమార్ నిలిచారు. ఈయన్ను తోటి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

నడుకూరులో వైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని నడుకూరులో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, బాలింతలు, రక్తపోటు, మధుమేహ, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వర్క్ షాప్

కురుపాం: మండలంలోని రస్తాకుంటుబాయ్ కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం శాస్త్రవేత్తలు సౌజన్య, అనంత విహారి ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శనివారం నిర్వహించిన వర్క్ షాప్‌కు పాలకొండ, సాలూరు, కురుపాం సహాయ వ్యవసాయ సహాయకులు కె. రత్నకుమారి, జి.సత్యవతి, ఆర్.అన్నపూర్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రస్తుత వ్యవసాయ పద్ధతులు వాటి సస్యరక్షణ చర్యలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రీయ ఎరువులు వాడకాలపై వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం కెవికెలో ఉన్న డెమో యూనిట్లను సందర్శించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ జయ

అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పది

కురుపాం : అన్ని దానాల కన్నా రక్తదానం చాలా గొప్పదని గర్భిణీలు, బాలింతలు రక్తహీనతతో బాధపడుతున్నప్పుడు అటువంటి వారికి రక్తం అనేది చాలా అవసరమని స్థానిక తహశీల్దార్ కె.జయ అన్నారు. శనివారం వాయుపుత్ర సేవా సంఘ సభ్యులు బి.అనిల్ ఆధ్వర్యంలో కురుపాంలో గల రావాడ కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవా సంఘాలు ఆధ్వర్యంలో ఇటువంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వాయుపుత్ర సేవా సంఘ సభ్యులను ఆమె అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్ర బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

ప్రధాన రహదారిలో లైట్లు ఏర్పాటు

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలోని ప్రధాన రహదారి మధ్యలో ఎట్టకేలకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో రూ.26 లక్షలతో వట్టిగడ్డ వంతెన నుండి స్వామి థియేటర్ వరకు సుమారు 1250 మీటర్ల దూరంలో 44 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఇరువైపులా వెలుగులు వెదజల్లేలా లైట్లు కూడా ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కృషి వల్ల విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. వీటిని త్వరలో ఎమ్మెల్యే, శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ కోరికన రవికుమార్ ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

2,3 తేదీల్లో ఆది కర్మయోగి శిక్షణ

సీతంపేట: సెప్టెంబర్ 2,3 తేదీల్లో వైటిసిలో ఆది కర్మయోగి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. 24 సచివాలయాల్లో 32 పంచాయతీల సచివాలయ సిబ్బందికి డిఎజోగా ఏ పంచాయతీలకు నిర్వహించారో కార్యదర్శులు సచివాలయం సిబ్బంది, మండల లెవెల్ అధికారులు సచివాలయ సిబ్బంది ముగ్గురు మండల లెవెల్ అధికారులు 14 మంది తప్పనిసరిగా శిక్షణకు హాజరుకావాలని తెలిపారు.

సదస్సులో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ కందికట్ల రాణి

నల్లరాయిగూడలో న్యాయ విజ్ఞాన సదస్సు

భామిని: 18ఏళ్లలోపు బాలికలకు ఎట్టి పరిస్థితుల్లో వివాహం చేయరాదని, పిల్లలకు నైతిక విలువలు నేర్పించి, సెల్ ఫోన్‌కు దూరంగా ఉంచాలని కొత్తూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కందికట్ల రాణి అన్నారు. మండలంలోని నల్లరాయిగూడలో కొత్తూరు మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇంతవరకు నల్లరాయిగూడలో ఎటువంటి వివాదాలు రాలేదు అని, ముున్ముందు ఇలాగే కొనసాగాలని ఆమె తెలిపారు. బత్తిలి ఎస్ఐ అప్పారావు మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మీ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, అనుకోని ప్రమాదం ఒక కుటుంబానికి ఆధారం లేకుండా చేస్తుందన్నారు. కార్యక్రమంలో న్యాయ వాదులు రాజు, బాలేరు సర్పంచ్ ప్రభాకర్, ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

పార్వతీపురం: మనం చేసే సేవలే మనకు గుర్తింపును తెస్తాయని జిల్లా ఖజానా, లెక్కలు అధికారి ఆర్ఎఎస్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా ట్రెజరిలో ఉప ఖజానా అధికారిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన నక్కిన సూర్య చంద్రశేఖర్ అభినందన సభలో ఆయన మాట్లాడారు. చంద్ర శేఖర్ మంచి స్వభావం ఉన్న వ్యక్తని, పెద్దల పట్ల గౌరవంతో మెలిగేవారని కొనియాడారు. మంచి ప్రవర్తనతో అందరి మన్ననలు అందుకోవడం అభినందనీయమని తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖలతో మంచి సమన్వయం, అధికారుల పట్ల వినయ విధేయతలతో మెలిగేవారని పేర్కొన్నారు. పదవీ విరమణ కేవలం వయసుకి మాత్రమేనని, పనికి విరమణ ఉండదని అన్నారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా పెన్షనర్ అసోసియేషన్ సెక్రటరీ జి.నారాయణ, ఇన్‌ఛార్జి ప్రెసిడెంట్ పి.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కంపెనీ పేరుతో భూములు తీసుకొని, తెగనమ్మడానికి సిద్ధపడ్డ జిందాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం బొడ్డవర వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిర్వాసితులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ భూములు ఇచ్చిన నిర్వాసితులకు కంపెనీ ఏర్పాటుచేసి, ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి జిందాల్ పరిశ్రమ యాజమాన్యం మోసగించిందన్నారు. భూములు కోల్పోయిన నిర్వాసితులు ఉపాధికి దూరమై, ఉద్యోగాలూ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే భూములను తిరిగి నిర్వాసితులకు అప్పగించాలని అధికారులను డిమాండ్ చేశారు. దళిత, గిరిజన నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు.

నత్తల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

నత్తల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ ఉద్యాన, వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నత్తల నివారణకు చర్యలపై సంబంధిత అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన, వ్యవసాయ అధికారులు అవిశ్రాంతంగా పనిచేయాలని, రైతులకు తగు సూచనలు సలహాలు అందించి వారిలో ధైర్యం నింపాలన్నారు. ఉద్యాన పంటల్లో స్పష్టమైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఉద్యాన, వ్యవసాయ పంటలపై ఆశించి విపరీతమైన నష్టం కలిగిస్తున్న ఆఫ్రికన్ నత్తలను నిర్మూలించే పద్ధతులపై రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు. పొలంలోని తుప్పలు, ఆకుల క్రింద, గాలి, వెలుతురు తగలని ప్రదేశాల్లో నత్తలు ఉండి వాతావరణం అనుకూలించినప్పుడు - జులై నుంచి ఫిబ్రవరి వరకు సంతానోత్పత్తి జరుగుతుందన్నారు. నెలకు 100 నుండి 400 గుడ్లు పెట్టి పిల్లలను చేస్తుందని, నత్త జీవిత కాలం (5 -6 సంవత్సరాలు) లో సుమారు 5వేల పిల్లలను పెడుతుందని తెలిపారు. ఇంత పెద్దఎత్తున పిల్లలను పెట్టడం వల్ల ఇవి బొప్పాయి, అరటి, జామ, కూరగాయలు, వక్క, ఆయిల్ పామ్ వంటి పంటలను ఆశించి కనీవిని ఎరుగని రీతిలో రైతులకు అపారమైన నష్టం కలిగించే అవకాశాలు ఉన్నాయని వివరించారు. నత్తలు మొక్కజొన్న, పత్తి వంటి ఇతర వ్యవసాయ పంటలకు కూడా పెద్ద ఎత్తున నష్టం కలిగించే అవకాశాలున్నాయన్నారు. నత్తలు అనుకూల వాతావరణంలో గుడ్లు పెట్టి పిల్లలు పెట్టి అనుకూలంగా లేనప్పుడు జంఝావతి వంటి నీరు వున్న ప్రదేశాలకు వెళ్ళి అక్కడ చిత్తడి ప్రదేశాల్లో లేదా తోటల్లో నీరు పారడం వల్ల తడిచిన ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త కింద దాగి ఉండి మళ్లీ వాతావరణం అనుకూలించినప్పుడు బయటకు వచ్చి గుడ్లు పెడుతున్నట్లు భావిస్తున్నామని తెలిపారు. కొమరాడ మండలం గంగరేగువలసలో ఈ ఆఫ్రికన్ నత్తలు ఎక్కువగా అభివృద్ధి చెందేందుకు కారణం రైతు ఒకే ఎకరాలో బొప్పాయి, జామ, వక్క, చామంతి లాంటి పంటలను వత్తుగా వేయటం వల్ల గాలి, వెలుతురు సరిగా సోకని పరిస్థితులు ఏర్పడడం, వర్షం పడిన తర్వాత నేల సరిగ్గా ఎండక పోవడం వంటి అనుకూల వాతవరణం వల్ల నత్తల పునరుత్పత్తి అధికంగా జరిగి వీటి ఉధృతి పెరిగినట్లు అంచనా వేస్తున్నామని చెప్పారు. నత్తలకు ప్రధానంగా ఇష్టమైన బొప్పాయి పంట ఉండడం వల్ల వాటికి మంచి ఆహారం కూడా దొరికినట్లు అయిందని శాస్త్రవేత్తలు పేర్కొనడం జరిగిందని ఆయన తెలిపారు. వీటిపై నివారణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు వేర్ల వ్యవస్థతో పాటు కలుపు మొక్కలను, పొలం నుండి చెత్త కుప్పలను తొలగించాలని ఆయన ఆదేశించారు. ఎప్పటికప్పుడు నత్తలను ఏరి ఉప్పు నీటి ద్రావణంలో వేయాలని, మెటల్డిహైడ్ గుళికలు (2.5-49)ను ఎకరానికి 3-5 కిలోల వేయాలని అన్నారు. 25 కిలోల ఊక 3 కిలోల బెల్లం, 100 గ్రాముల థియోడికార్బ్, 100 మి.లీ. ఆముదం నూనె కలిపి చిన్న ఉండలు చుట్టి పొలంలో అక్కడక్కడా పెట్టుకోవాలని సూచించారు. రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ఎస్. ఎన్ రెడ్డి, ఉద్యాన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని, తమకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆటో యూనియన్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎమ్మెల్యే బి.విజయ్ చంద్రతో రాయబార కార్యక్రమాన్ని ఆటో కార్మికుల నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ టిడిపి అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్ ద్వారా వినతిపత్రం అందజేశారు. ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతినకుండా చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకునేలా కృషి చేయాలని ఎమ్మెల్యేను ఆ వినతి పత్రంలో కోరారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ కన్వీనర్ బంకురు సూరిబాబులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకాన్ని సిఐటియు స్వాగతిస్తున్నదని, అదే సందర్భంలో ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని కోరారు. వాహనమిత్ర తరహా పథకాన్ని రూపొందించి ఏడాదికి రూ.25 వేలు పరిహారం చెల్లించాలని, ప్రతినెలా ఆటో కార్మికులకు కార్మిక సంక్షేమ పెన్షన్ చెల్లించాలని, ఆటో ట్యాక్సీలపై తీసుకున్న రుణాలపై మాఫీ విధించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల ఆందోళనకు స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేసేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో వర్కర్ యూనియన్ నాయకులు సంబాన చిన్న, నాగభూషణరావు, శంకర్రావు, సింహాచలం, రవికుమార్, పట్టణానికి చెందిన వివిధ స్టాండ్ల ఆటో కార్మికులు పాల్గొన్నారు.

9,698 మందికి పింఛన్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 24 సచివాలయాల పరిధిలో వికలాంగులు, వితంతు, వృద్ధాప్య, చేనేత, కల్లుగీత, మత్స్యకార, ఒంటరి మహిళ, చర్మకారులు, డప్పు కళాకారులు తదితర రకాలైన 9,698 మందికి సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ శనివారం తెలిపారు. 182 మంది పింఛన్ పంపిణీ అధికారులు గృహాలకు వచ్చి పింఛను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

జగన్‌మోహన్‌కు సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం

సత్కరిస్తున్న సొసైటీ సభ్యులు

స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వెనుక గల గణేష్ నగర్‌లో, గణేష్ నగర్ డెవలప్ మెంటల్ సొసైటీ ఆధ్వర్యాన ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ తెర్లి జగన్మోహనరావు ఉత్తమ సేవలు అందించినందుకు గాను శుక్రవారం రాత్రి వినాయక చవితి వేడుకలు సందర్భంగా ప్రశంసా పత్రం బహూకరించి, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. గణేష్ నగర్ టీచర్స్ కాలనీ వాసులుగా మరింత ఉత్తమ సేవలను అందించాలని కోరుతూ డాక్టర్ జగన్మోహన్ రావును అభినందించారు. కార్యక్రమంలో గణేష్ నగర్ డెవలప్‌మెంటల్ సొసైటీ సభ్యులు, గణేష్ నగర్ టీచర్స్ కోలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్ఐ

లివిరిలో వాహన తనిఖీలు

ప్రజాశక్తి -భామిని

మండలంలోని లివిరి జంక్షన్లో బత్తిలి ఎస్ఐ అప్పారావు ఆధ్వర్యంలో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనం నడిపే వరకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అని, అతివేగంతో వాహనం నడపొద్దని సూచించారు. పెండింగ్ చలనాలను వాహనదారులతో కట్టించారు. నిబంధనలు పాటించని వాహనాలు చలానాలు వేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సస్పెండ్ చేయడం సమంజసం కాదు

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఆడిట్ పేరుతో లక్షల రికవరీలు, సస్పెండ్‌లు చేయడం సమంజసం కాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు జిల్లా అధ్యక్షులు ఎం. హరినాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 20 సంవత్సరాలుగా ఇదే వృత్తిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని, రిజిస్టర్లు, పేపర్లు స్టేషనరీ ఖర్చులు భరించవలసి వస్తుందని అన్నారు. రికార్డులకు రూ.5వేలు ఖర్చు అవుతుందని, ఫీల్డ్ అసిస్టెంట్లు చేయకూడని యాప్‌లు పని కూడా చేయిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సెప్టెంబర్ 7న పార్వతీపురంలో జరగనున్న ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా మహాసభలను అధిక సంఖ్యలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు రాజేశ్వరి, శంకర్రావు, హరి, బాబి, సంఘం నాయుడు, శ్రీనివాస, మాధవ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మన్మధరావు

రైతులకు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

మొక్కలను పంపిణీ చేస్తున్న అధికారులు

మండలంలోని మర్రిపాడు పంచాయతీ పరిధిలో గల గుడగుడ్డి, రేగులగూడ, ఎగువ ద్వార బంధాలు గ్రామాల రైతులకు 44 మందికి 710 జామి మొక్కలను స్థానిక ఐటిడిఎ హార్టికల్చర్ సహకారంతో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.క్రాంతి కుమార్ చేతుల మీదుగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ పండ్లు మొక్కలు తోటల పెంపకం ద్వారా రైతుకు మేలైన ఆరోగ్యం, మంచి ఆదాయం, సుస్థిరమైన జీవనోపాధి పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్లు, సవర ఆనందరావు పి నాగేశ్వరరావు, గోపాల్ రావు, ఎస్ రామయ్య మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

శక్తి యాప్ మహిళలకు వజ్రాయుధం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మహిళలకు శక్తి యాప్ ఒక వజ్రాయుధం వంటిదని శక్తి యాప్ పోలీస్ అధికారులు అన్నారు. పట్టణంలోని శక్తి టీమ్స్ పోలీస్ అధికారులు, సిబ్బంది శనివారం పలు పాఠశాలలు, కళాశాలల్లో, బస్ స్టాండ్స్, రద్దీ ప్రాంతాలను సందర్శించాయి. ప్రజలకు, విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనార్థాలు, డయల్ 112 సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శక్తి టీం ఇంచార్జ్ ఏఎస్ శ్రీనివాస రావు మాట్లాడుతూ జిల్లాలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి శక్తి టీం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోందన్నారు. ఇందులో భాగంగా టీం డ్రోన్ల సహాయంతో విస్తృత స్థాయిలో పర్యవేక్షణ చేపట్టడం జరిగిందన్నారు. వీటివల్ల విస్తారమైన ప్రాంతాలను తక్కువ సమయంలో సమగ్రంగా పరిశీలించి అనుమానాస్పద కదలికలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలను తక్షణమే గుర్తించేందుకు, ఉపయోగపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బాలరాజు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని కోడికాళ్ళవలస గ్రామానికి చెందిన మత్స్యకారుడు జన్ని బాలరాజు పెద్ద గడ్డ జలాశయంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందేనని ఆయన కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఎంపిపి బడ్నాన ప్రమీల కోరారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పొట్టకూటి కోసం పెద్ద గడ్డ జలాశయం నిర్వాసిత గ్రామాలకు చెందిన గిరిజన మత్స్యకారులు నాటు పడవలు ద్వారా జలాశయంలోకి చేపల వేటకు వెళ్లి నాటు పడవలు బోల్తా పడి ఎంతోమంది మత్స్యకారులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మత్స్యకారులు ప్రాణాలకు రక్షణగా ప్రభుత్వం సబ్సిడీపై బోట్లు, లైఫ్ జాకెట్లు, వలలు తదితర పరికరాలను అందజేయాలని కోరారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షలు నష్ట పరిహారం అందజేయాలని సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరావు కోరారు. స్థానిక ఎస్ఐ కె.వెంకట సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఎన్‌డిఆర్ఎఫ్ బృందం గత మూడు రోజులుగా ఎంతో శ్రమించి బాలరాజు మృతదేహాన్ని శనివారం వెతికి తీశారు.

అభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర

ప్రజాశక్తి- పాచిపెంట

కుటుంబం ఆర్థికంగా గాని సామాజికంగా గాని అభివృద్ధి చెందాలంటే మహిళలదే కీలక పాత్ర అని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం విభాగం శాస్త్రవేత్త ఉమా జ్యోతి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గిరిజన మహిళలు ఆర్థిక అభివృద్ధికి పలు సూచనలు అందించారు. పదిమంది గిరిజన మహిళలు వచ్చినట్లయితే వారికి చిరుధాన్యాలు వాటి ఉత్పత్తులు విలువల పెంపు, అటవీ ఉత్పత్తులకు విలువల జోడింపు వంటి పలు అంశాలపై ఉచితంగా శిక్షణ ఇస్తామని గ్రామైక్య, మండల సమాఖ్యల ద్వారా కృషి విజ్ఞాన కేంద్రానికి దరఖాస్తులు పెట్టుకోవచ్చని తెలిపారు. చింతపండు బ్లాక్‌ల తయారీ, తేనెటీగల పెంపకం చిరుధాన్యాలతో కురుకురే, బిస్కెట్లు తయారీ వంటి వాటిపై కూడా పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తామని, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి తిరుపతిరావు, శతాభి సర్పంచ్ రామయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమా జ్యోతి

భోజనాల బిల్లు చెల్లించండి

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లాలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన బిల్లులు తక్షణమే చెల్లించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, అధ్యక్షుడు తాడంగి సాయిబాబు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమయానికి బిల్లులు చెల్లించకపో వటానికి జిల్లా విద్యా శాఖ అధికారి నిర్లక్ష్యమే కారణమని వారన్నారు. ఇప్పటికైనా స్పందించి బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి భోజనం బిల్లులు చెల్లించకతే నిర్వహణ ఎలా అని ప్రశ్నించారు. జిల్లాలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 15 జూనియర్ కళాశాలల్లో 14 కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్లు లేరన్నారు.

జంఝావతి నిర్మాణానికి చొరవ చూపండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మన్యం జిల్లా ప్రజలు, రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న జంఝావతి ప్రాజెక్టు నిర్మాణానికి ఒడిశా ప్రభుత్వం తరఫున చొరవ చూపి, సహకారం అందించాలని ఎమ్మెల్యే విజయచంద్ర కోరారు. భువనేశ్వర్‌లో జరుగుతున్న లోక్ సభ, వివిధ రాష్ట్రాల శాసనసభ ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ కమిటీ ప్రతినిధుల జాతీయ సదస్సుకు హాజరైన ఆయన ఈ సందర్భంగా ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంఝిని శనివారం కలిశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో దాదాపు 25వేల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించే ఈ ప్రాజెక్టు గత 5 దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. ఒడిశాలో వెయ్యి ఎకరాల భూ సేకరణ పూర్తయితే పనులు వేగవంతమయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీనిపై చొరవ చూపి, తమ ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్‌ను నెరవేర్చాలని విన్నవించారు. దీనిపై ఒడిశా సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే విజయచంద్ర తెలియజేశారు.

సూపర్ సిక్స్.. సూపర్ హిట్ : ఎమ్మెల్యే

మహిళలతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిన ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం కురుపాంలో స్త్రీ శక్తి మహిళా సంఘాల సభ్యులతో జరిగిన సమావేశానికి గుమ్మలక్ష్మీపురం నుండి ఆర్‌టిసి బస్సులో ప్రయాణించి కురుపాంలో గల టిడిపి కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించి ర్యాలీగా దూళికేశ్వర ఆలయం సమీపంలో జరిగిన సమావేశానికి వెళ్లి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్త్రీ పథకం ప్రవేశపెట్టి ప్రతి ఒక్క మహిళకు రాష్ట్రంలో ఆర్‌టిసి బస్సులు ద్వారా ఆధార్ కార్డు చూపించి ఎక్కడికైనా ప్రయాణించేలా చేశారని చెప్పారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అందించారన్నారు. అనంతరం మహిళ ప్రజా ప్రతినిధులకు ఎమ్మెల్యే సన్మానం చేశారు. ఎమ్మెల్యే జగదీశ్వరికి మహిళా సంఘాల సభ్యులు, మహిళా ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించాలాల మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కురుపాం రావాడ జంక్షన్ వరకు సుమారు 19 కిలోమీటర్లు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి స్త్రీ శక్తి మహిళలతో కలిసి ఆర్‌టిసి బస్సులో శనివారం ప్రయాణించారు. తోటి ప్రయాణికులతో విక్టరీ చూపుతూ కురుపాంలో జరిగే స్త్రీ శక్తి ర్యాలీకి వెళ్లారు. సూపర్ సిక్స్ హామీల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మహిళలందరికీ స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. మహిళా సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృ షి చేస్తుందన్నారు.

ట్యాంకర్ లారీ బోల్తా

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని సింగారంపేట సమీపాన రహదారిపై యాసిడ్ ట్యాంకర్ లారీ బోల్తా పడి పెను ప్రమాదం తప్పిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం విజయవాడ నుంచి ఒడిశా యాసిడ్ లోడుతో వెళ్తున్న ట్యాంకర్ లారీ బోల్తాపడింది. ఎదురుగా ఆర్టీసీ బస్సుతో కనీసం 150 మంది మహిళలు కురుపాంలో జరిగే స్త్రీశక్తి సమావేశానికి వెళ్తున్నారు. అయితే బస్సుకు ఎటువంటి ప్రమాదం జరగలేదని, ఏమైనా జరిగితే ఘోరం ప్రమాదం జరిగేదని స్థానికులు చెబుతున్నారు. అలాగే అటువైపుగా విధులకు వెళ్తున్న రేగిడి పోస్ట్ మాస్టర్ వి.తిరుపతిరావు, మరి కొంతమంది స్థానికులు గాయాలతో ఉన్న లారీ డ్రైవర్‌ను బయటికి తీసి భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్య సిబ్బంది చికిత్సను అందిస్తున్నారని డ్రైవర్ ఆరోగ్యం కూడా నిలకడగా ఉందని ప్రాణాపాయం లేదని వైద్య సిబ్బంది తెలిపారని అన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని లోవరకండిలో ఈనెల 28న జరిగిన కార్తీక్ హత్య కేసులో నిందితుడు సాగరపు శివం దొరను శనివారం అరెస్టు చేసినట్లు సాలూరు రూరల్ సిఐ రామకృష్ణ తెలిపారు. శనివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్తీక్ హత్యకు దారి తీసిన వివరాలను వెల్లడించారు. హత్యకు ఉపయోగించిన చక్ర గుత్తు అనే ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు శివందొరను కోర్టుకు తరలించినట్లు ఆయన వెల్లడించారు.

GOVERNMENT OF ANDHRA PRADESH

Office of the District Economics & Statistics Officer, Parvathipuram Manyam

C.No.28/2024/DESO/DYSO(Plg) Dt 30-08-2025

TENDER NOTIFICATION

Sealed Tenders are invited from interested reputed firms/dealers for procurement of Computers, Computer Peripherals & Furniture for DVAP unit & CVAP units in Parvathipuram Manyam District. Schedules/applications for each item including specifications will be issued on submission of Demand Draft for Rs.5000/-(Rupees Five thousand only Non refundable) in the office of the District Economics & Statistics Officer, Parvathipuram Manyam taken from any Nationalized Bank favour of "Joint Collector, Parvathipuram Manyam. The DPC has the right to modifications / Cancellation of the Tender process.

Issue of tender application starts: from Dt.01-09-2025 to Dt. 09-09-2025 (10:30 am to 5:00 pm in all working days).

Closing date for receiving tender application is: 09-09-2025 by 5:00 pm.

Sd/- JOINT COLLECTOR & CHAIRPERSON
District Procurement Committee, Parvathipuram Manyam District.